సిబ్బంది.. లేక ఇబ్బంది

- విద్యుత్ శాఖలో భర్తీ కాని పోస్టులు
- ఉన్న వారిపైనే అదనపు భారం
- అంతరాయం కలిగితే అంతే సంగతులు


ప్రత్తిపాడులో విద్యుత్ సబ్ స్టేషన్

ప్రత్తిపాడు: నిత్య జీవితంలో ప్రతి పనికీ విద్యుత్ ఎంతో అవసరం అవుతోంది.. అయితే విద్యుత్ విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతులు.. అలాంటి కీలకమైన శాఖలో సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది.. ఏదైనా సమస్య వస్తే పరిష్కారానికి గంటల సమయం పడుతోంది.. ఉన్న సిబ్బందిపై నెట్టుకు రావాల్సి వస్తోంది. ప్రత్తిపాడు మండలంలో పరిస్థితి ఇది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ పురుడు పోసుకుంది. అప్పట్లో అన్ని సచివాలయాల్లో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం)లను నియమించింది. ఎప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా తక్షణం మరమ్మతులు చేసేలా కార్యాచరణ చేసింది. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారింది. జేఎల్ఎంలలో కొందరు బదిలీలు కావడం, మరికొందరు పదోన్నతులపై వెళ్లడం తదితర కారణాలతో ఖాళీ అయిన పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. దీంతో కరెంటు పోగానే స్పందించే జేఎల్ఎంలు లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రత్తిపాడు, ఉత్తరకంచి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో జేఎల్ఎంలు, షిఫ్ట్ ఆపరేటర్ల కొరత వేధిస్తుంది. ఈ పోస్టుల భర్తీకి చర్యలు కానరావడం లేదు. దీంతో ఆ శాఖలో ఉన్న సిబ్బందిపైనే పనిభారం పెరుగుతోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తితే అంతే సంగతులు అన్నట్లు ఉంది. విద్యుత్ కనెక్షన్లు పెరగడం, బిల్లుల రూపేణా రూ.లక్షలు వస్తున్నా అందుకు అనుగుణంగా ఉద్యోగులు, సిబ్బంది నియామకం చేపట్టకపోవడంపై జనం నిట్టూర్పు వదులుతున్నారు.

గాలేస్తే అంతే..

ఈదురు గాలులు వీస్తే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గంటల తరబడి ఆటంకం కలుగుతోంది. ఇతరత్రా సమస్యలతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు పోయినా, తీగలు తెగిపడినా సరిచేసేందుకు చాలా సమయం పడుతోంది. కొన్నిసార్లు రోజుల తరబడి సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు ప్రధాన లైన్ తెగిపోవడం, పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, తీగలు తెగిపడడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిని పునరుద్ధరించడానికి మూడు రోజులు పట్టింది.

సిబ్బంది కొరత

మండలంలో అన్ని కేటగిరీలకు సంబంధించి మొత్తం 24,995 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రత్తిపాడు, ఉత్తరకంచి సబ్ స్టేషన్లలో ఒక అసిస్టెంట్ ఇంజినీర్, ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఎనిమిది మంది లైన్‌మెన్లు, 14 మంది జూనియర్ లైన్‌మెన్లు పని చేస్తున్నారు. ఇంకా ఒక సబ్ ఇంజినీర్, 12 మంది జూనియర్ లైన్‌మెన్లు, షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎనిమిది మంది లైన్‌మెన్లలో నలుగురు ప్రత్తిపాడు సబ్ స్టేషన్లో షిఫ్ట్ ఆపరేటర్ విధులు కూడా నిర్వర్తిస్తున్నారు. ఉత్తరకంచిలో నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారు. ఉన్న కొద్దిపాటి సిబ్బందితోనే ఆ శాఖ అధికారులు నెట్టుకొస్తున్నారు. సిబ్బంది కొరతతో విద్యుత్ సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మండలంలో విద్యుత్ కనెక్షన్లు

కేటగిరీ	మీటర్ల సంఖ్య
గృహాలు	21,036
వ్యాపార సంస్థలు	1,854
రైస్‌మిల్లులు, పరిశ్రమలు తదితరాలు	61
ప్రభుత్వ సంస్థలు (పాఠశాలలు, మంచినీటి ట్యాంకులు, వీధిలైట్లు తదితర)	485
వ్యవసాయ రంగం	1,559

ఉన్నతాధికారులకు వివరించాం



మండలంలో విద్యుత్ సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు వివరించాం. ప్రస్తుతం విద్యుత్ సమస్య లేకుండా ఉన్న సిబ్బందితో పరిష్కరిస్తున్నాం. ఈదురు గాలులు వీచిన ప్పుడు, బ్రేక్ డౌన్‌లు అయితే కొంత ఆలస్యమవుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.శ్రీను, విద్యుత్ శాఖ ఏఈ, ప్రత్తిపాడు

అమలు కాని హామీలతో మోసం

- అన్ని వర్గాలకు చంద్రబాబు వెన్నుపోటు
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గిరిబాబు


ఏలేశ్వరంలో స్పార్క్ ప్రతినిధులను అభినందిస్తున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


కిర్లంపూడిలో గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రత్తిపాడు: ఎన్నికల ముందు అమలుకాని అమలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. టి.రాయవరం గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ తటవర్తి రామన్నదొరను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లు అమలు కాని హామీలిచ్చి, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారన్నారు. నమ్మి ఓటేసిన ప్రజలను నిలువునా ముంచేశారని దుయ్యబట్టారు. ఎస్సీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లు దాటితే పింఛన్ ఇస్తానని చెప్పి చంద్రబాబు ఇప్పుడు మాట దాటేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ బత్తుల నాగార్జున, ఏలూరు మాజీ ఉప సర్పంచ్ కొండి శ్రీను, తటవర్తి అయ్యన్నదొర తదితరులు ఉన్నారు.

పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేద్దామని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాసంశెట్టి రంగా ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి చేరుకుని గిరిబాబును కలిసి సత్కరించారు. మండల కన్వీనర్ రామిశెట్టి నాని, మొరుకుర్తి నాగవినోద్ యాదవ్, రాసంశెట్టి వీరబాబు, అప్పికొండ లచ్చబాబు, రాసంశెట్టి సత్తిబాబు, జువ్వల బాబ్జి, మొల్లేటి వెంకటన్న, కాళ్ల వీరబాబు, కొల్లు గంగబాబు, బచ్చల శ్రీను తదితరులు ఉన్నారు.

స్పార్క్ ఫౌండేషన్‌కు అభినందన

ఏలేశ్వరం: భౌగోళిక అంశాలపై వివిధ ప్రయోగాలు చేస్తున్న స్పార్క్ ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం రావడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అభినందనలు తెలిపారు. డెహ్రాడూన్ వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం పర్యావరణ, అరణ్య, వాతావరణ మార్పులపై జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో స్పార్క్ ఫౌండేషన్ ప్రశంసా పత్రం అందుకుంది. ఈ సందర్భంగా స్పార్క్ చైర్మన్ సాయిసందీప్, సీఈఓ సాయిప్రదీప్‌ను ఏలేశ్వరంలో గిరిబాబు అభినందించారు. పార్టీ నేతలు బదిరెడ్డి గోవిందు, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

- కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి దుర్గాదేవి ఆశీస్సులు అందరిపై ఉండాలని ముద్రగడ గిరిబాబు అన్నారు. ఏలేశ్వరంలో దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా జేవీఆర్ ట్రస్టు చైర్మన్ జువ్విన వీర్రాజు, వీరరాఘవమ్మ దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని గిరిబాబు ప్రారంభించారు. పార్టీ నేతలు బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, లోగిసు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శంఖవరం: కత్తిపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గాబు కృష్ణ, గాబు గంగ సోదరుడు గాబు మసిలి ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబాన్ని నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. అలాగే బేతా ఏసుబాబు తండ్రి మాణిక్యం ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు, ఎంపీటీసీ సభ్యులు జీలకర్ర విష్ణు, చప్పా రాంబాబు, సత్యప్రసాద్, నాయకులు అడపా సోమేష్, పెయ్యల చక్రం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన


గండేపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం
- మాజీ మంత్రి తోట నరసింహం ధ్వజం

గండేపల్లి: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం ధ్వజమెత్తారు. గండేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో తాగునీరు దొరకడం కష్టమవుతోందని, కల్తీ మద్యం మాత్రం ఏరులై పారుతుందని ఆయన దుయ్యబట్టారు. బెల్ట్‌షాపులు, మద్యం అక్రమ విక్రయాలు జోరుగా సాగుతున్నా పోలీసులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. కల్తీ మద్యం తాగి అనేక మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వివరించారు. అన్నమయ్య, గుంటూరు జిల్లాల్లో కల్తీ మద్యం తయారీ జోరుగా సాగుతుందని, వారికి టీడీపీ నాయకుల అండదండలు ఉండటంతోనే అధికారులు వాటిని అరికట్టలేకపోతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో తెచ్చేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొస్తే, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడం దారుణమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అక్రమ బాణసంచా తయారీ కేంద్రాలను అరికట్టి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో దుర్ఘటన జరగడం బాధాకరమన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు చలగళ్ల దొరబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి మూర్తి, రాష్ట్ర ఐటీ విభాగం జనరల్ సెక్రటరీ తాళ్లూరి మధు, పార్టీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కరుటూరి వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, గుర్రం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

గోకవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి ఆదేశించారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. మెనూను పరిశీలించి సక్రమంగా అమలు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కోడిగుడ్లు నాణ్యత లేకపోవడాన్ని గుర్తించి, ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గుమ్మళ్లదొడ్డి గ్రామంలో రేషన్ షాపును తనిఖీ చేసి షాపు వద్ద సరకుల వివరాలు, అధికారుల ఫోన్ నంబర్లకు సంబంధించిన బోర్డు లేకపోవడంపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ పార్వతి, ఏఎస్ఓ నాగాంజనేయులు, ఎంఎస్ఓ శాంతిప్రియ ఉన్నారు.


గోకవరంలో కోడిగుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఆహార బోర్డు కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

కెనరా బ్యాంక్ టర్నోవర్ రూ.6,900 కోట్లు


ప్రత్తిపాడులో కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభించిన విజయలక్ష్మి

ప్రత్తిపాడు: అనతి కాలంలోనే కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్‌లో రూ. 6,900 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని ఆ బ్యాంక్ విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ సీజే విజయలక్ష్మి అన్నారు. ప్రత్తిపాడులో కొత్తగా కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 324 బ్యాంకులుండగా ప్రత్తిపాడు బ్యాంకు 325వ బ్యాంచ్ అన్నారు. బ్రాంచ్ ద్వారా స్వయం సహాయక సంఘాలతో పాటు, వ్యవసాయ రుణాలు, అపార్ట్‌మెంట్లు, బంగారు నగలపై రుణాలు పొందవచ్చని చెప్పారు. బ్యాంకు ద్వారా అందించే సేవలను కెనరా బ్యాంక్ కాకినాడ రీజినల్ మేనేజర్ ఆర్.గణేష్ వివరించారు. బ్యాంక్ మేనేజర్ పి.పద్మ, బీబీఆర్ గార్డెన్స్ అధినేత బండారు బాబూరావు, బోర్డు మెంబర్ కొమ్ముల కన్నబాబు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు (నానీ), పద్మశాలీ సంఘ అధ్యక్షుడు గిడుతూరి నాగరాజు, అత్తి ఉమామహేశ్వరరావు, బండారు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


కిర్లంపూడిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తోట రవి

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో మండల స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలకు ఎంఈఓ టి.జోషఫ్ అధ్యక్షత వహించగా, ఎంపీపీ తోట రవి హాజరై ప్రారంభించారు. హెచ్ఎం రమణికుమారి మాట్లాడుతూ తొలిరోజు అండర్- 14, 17 బాలురకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించామన్నారు. కబడ్డీ అండర్- 14 విభాగంలో తామరాడ, అండర్- 17లో గెద్దనాపల్లి, ఖోఖో పోటీల్లో అండర్- 14, 17 విభాగాల్లో కిర్లంపూడి, వాలీబాల్ అండర్- 14 విభాగంలో తామరాడ, అండర్- 17 విభాగంలో కిర్లంపూడి విద్యార్థులు విజయం సాధించారన్నారు. గురువారం ఆయా విభాగాల్లో బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. సొసైటీ చైర్మన్లు తోట గాంధీ, కుర్ల చినబాబు పాల్గొన్నారు.

దళితుల నిరసన


అన్నవరంలో దళిత నాయకుల నిరసన ప్రదర్శన

అన్నవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌కే గవాయిపై కోర్టులో బూటు విసిరి తీవ్రంగా అవమానించిన న్యాయవాది రాకేష్ కిశోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ అన్నవరంలో దళితులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. దళిత నాయకుడు తంతటి కిరణ్ కుమార్, సరమర్ల మధుబాబు, గోసి లక్ష్మణ్ మాట్లాడుతూ బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనలో సామాన్య దళితులకే కాదు ఉన్నత పదవుల్లో ఉన్న సీజేఐ గవాయ్ వంటి వారికీ రక్షణ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది రాయి శ్రీనివాస్, బండి చిట్టిబాబు, పిల్లి బాబ్జీ, సూర్యారావు, బుర్తి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో అన్నదానం


దేవీచౌక్ వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు పది వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అమ్మవారి సేవకులు మాట్లాడుతూ ఉత్సవాలకు సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

నీటిపారుదల పథకానికి 12న శంకుస్థాపన

జగ్గంపేట: మామిడాడ వద్ద రూ.3.49 కోట్లతో జ్యోతుల పాపారావు నీటిపారుదల పథకానికి 12న ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. మామిడాడ వద్ద శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే చంటిబాబు పుట్టినరోజు వేడుకలు


మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో కేక్ కట్ చేయిస్తున్న పార్టీ నేతలు

జగ్గంపేట: స్థానికంగా మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పుట్టిన రోజు వేడుకలను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయన క్యాడర్ పెద్ద ఎత్తున తరలివచ్చారు. కేక్ కట్ చేయించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులుగా జ్యోతుల చంటిబాబును పార్టీ నియమించినందుకు నేతలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. నియోజకవర్గంలో చంటిబాబు సారథ్యంలో పార్టీ మరింత బలపడుతుందని, వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయ కేతనం ఎగురవేస్తుందని నేతలు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బండారు రాజా, దోమాల గంగాధర్, ఇళ్ల అప్పారావు కాపు, బొదిరెడ్డి చక్రరావు, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

సుందర్రావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


హైదరాబాద్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న సుందర్రావు

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన గుడాల సుందర్రావు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ వేడుకలను ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) నిర్వహించింది. ఏఐసీఎఫ్ వ్యవస్థాపకుడు గెద్దపాటి విజయరాజు, వైఎస్ విమలమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు సుందర్రావు తెలిపారు. ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక రంగాలకు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారని ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి గుడాల వెంకటరత్నం, యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, మినర్వా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆనందకుమార్ జోషీ తదితరులు ఆయన్ని అభినందించారు.

ముమ్మరంగా ఈ-కేవైసీ నమోదు

తుని రూరల్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుంది. ఇది మరో రెండు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందని ఏపీఓ పసుపులేటి నారాయణరావు తెలిపారు. మండలంలో 12 వేల జాబ్ కార్డులు ఉండగా, అందులో 25 వేల మంది కూలీలు ఉన్నారన్నారు. ఆరు వేల మంది వరకూ పనులు చేస్తున్నారన్నారు. ఈ-కేవైసీతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చన్నారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రితో ఎస్సై పవన్‌కుమార్

గోకవరం: మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి మందుగుండు సామగ్రిపై గోకవరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో దాడులు చేసి, లైసెన్సు లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ.40 వేల విలువైన మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

ఆర్టీసీ డిపో సందర్శన


తునిలో ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ శోభామంజరి

తుని రూరల్: తుని ఆర్టీసీ డిపోను అసిస్టెంట్ డైరెక్టర్ టి.శోభామంజరి సందర్శించారు. బుధవారం డిపోకు వచ్చిన ఆమె ఉద్యోగులతో మాట్లాడారు. డిపో ఆర్థిక పరిస్థితి, నిర్వహణ, ఉద్యోగుల ఆరోగ్యం, పని విధానం, ఆక్యూపెన్సీ తదితర వివరాలపై మాట్లాడారు. అనంతరం గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. డిపో మేనేజర్ జీజీవీ రమణ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు

కోటనందూరు: స్థానిక నాస్ భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. చిన్నారులతో ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు పలు వ్యాయామాలు చేయించారు. రోజూ చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఏడిపింఛన్..


జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్న భాస్కరరావు కుటుంబం

జగ్గంపేట: వికలాంగత్వం కుంగదీస్తోంది.. బతుకు భారమైంది.. కుటుంబ పోషణ కష్టమైంది.. అయినా ప్రభుత్వం సాయం అందక ఆ కుటుంబం ఇబ్బంది పడుతోంది. మల్లిసాల గ్రామంలో సుందరం భాస్కరరావు ముప్పై ఏళ్లుగా నివసిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రెండేళ్ల కిందట సాగో మిల్లులో పని చేస్తుండగా మెషీన్‌లో కుడి చేయిపడి పూర్తిగా నలిగిపోవడంతో దానిని చివరి వరకూ తీసేశారు. అప్పటి నుంచి అతనికి కష్టాలు మొదలయ్యాయి. ఉపాధి దూరమై నానా అగచాట్లు పడుతున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు. జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి


అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, వ్యవసాయ ఉత్పత్తిదారులు

తుని రూరల్: నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు ఉద్యాన పంటల్లో ప్రధానంగా కొమ్మల కత్తిరింపు ప్రక్రియ కీలకపాత్ర వహిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి సిరిల్ అన్నారు. బుధవారం జగన్నాథగిరి నాసా ఆవరణలో అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిల్ మాట్లాడుతూ కొమ్మల కత్తిరింపు వల్ల పంటలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనివల్ల పూత, పిందె, కాయల సంఖ్య పెరుగుతుందన్నారు. నాణ్యమైన దిగుబడులు లభిస్తాయన్నారు. అపెడా బీఎం పెద్దస్వామి మాట్లాడుతూ ఏ విధంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలో సమగ్రంగా వివరించారు. పురుగు మందు అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను అపెడా ద్వారా మార్కెట్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. మామిడిలో తెగుళ్లు, పురుగుల నివారణ, యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్త శర్మ వివరించారు. మోతాదుకు మించి రసాయనిక మందులు వాడరాదన్నారు. తుని ఉద్యాన అధికారి సుజాత రైతులకు పలు సూచనలు చేశారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల రైతులు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



భద్రవరంలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

ఏలేశ్వరం: జగ్గంపేటలో ఈ నెల 28న నిర్వహించే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ భద్రవరం గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. భూ, మైనింగ్ మాఫియాలకు జిల్లా అడ్డాగా మారిందన్నారు. పాలకపక్ష నాయకుల అవినీతి విపరీతంగా పెరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు జక్కంపూడి రాజు, ఏలియా, నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


హౌసింగ్ పీడీ బుజ్జిని సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

గండేపల్లి: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండేపల్లిలో ఎంపీడీఓగా విధులు నిర్వహించి, జిల్లా హౌసింగ్ పీడీగా పదోన్నతిపై వెళ్లిన నాతి బుజ్జి సేవలను కొనియాడారు. గోకవరం, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఎంపీడీఓగా ప్రజలకు మెరుగైన సేవలందించారన్నారు. అనంతరం బుజ్జిని సన్మానించారు. ముందుగా వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఎంపీడీఓ కె.హరికృష్ణ సత్యరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ కె.చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఐఎస్ శ్రీనివాస్, సీడీపీఓ ఎం.పూర్ణిమ, ఏపీఓ కృష్ణరాజు, పీఆర్ డీఈ ఉమాశంకర్, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలపై 25 అర్జీలు

తొండంగి: బెండపూడిలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 25 అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే యనమల దివ్య పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.